జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం





భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 25 | డిసెంబర్ | 2025 ◆ పేజీలు : 6


## ట్రాఫిక్ పోలీస్ స్టేషను తనిఖీ చేసిన డిఎస్పీ

**- ప్రమాదాల నివారణకై ప్రజలకు నిత్యం అవగాహనా కల్పించాలి**



**కొత్తగూడెం, డిసెంబర్ 24 (ప్రజా జ్యోతి):** ట్రాఫిక్ పోలీస్ స్టేషను కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ బుధవారం తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో పని చేసే సిబ్బంది కోసం ప్రక్కనే ఉన్న భావనంలో విశ్రాంతి గదులను ప్రారంభించారు. పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను

మిగతా 2 లో...



**దమ్మపేట, డిసెంబర్ 24 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో పోలీసులు చేపట్టిన వాహన తనిఖీలు డ్రగ్స్ మాఫియాకు గట్టి దెబ్బగా మారాయి. దమ్మపేట పోలీసులు, తెలంగాణా ఈగల్ ఫోర్సు ఖమ్మం సంయుక్తంగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో రూ.1.52 కోట్ల విలువైన నిషేధిత గంజాయి భారీగా పట్టుబడింది. అంతర్ రాష్ట్రస్థాయిలో సాగుతున్న గంజాయి అక్రమ రవాణా గుట్టును పోలీసులు ఛేదించడంతో జిల్లా వ్యాప్తంగా సంచలనం నెలకొంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ రోజు ఉదయం 10 గంటల సమయంలో, దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అచ్చుతాపురం గ్రామ క్రాస్ రోడ్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రాజమండ్రి నుంచి సతుపల్లి వైపు వెళ్తున్న టాటా గూడ్స్ కంటైనర్ లారీ (టి.యన్ 73 ఎ డి 9515) తో పాటు దానికి ఎస్కార్ట్ గా వెళ్తున్న మారుతి సుజుకి ఎర్టిగా కారును అనుమానంతో ఆపి తనిఖీ చేశారు. లారీ కంటైనర్ ను క్షుణ్ణంగా పరిశీలించగా, క్రింది భాగంలో అనుమానం రాకుండా ప్రత్యేకంగా తయారు చేసిన సీక్రెట్ ఛాంబర్ లో భారీగా గంజాయి పాకెట్లు

మిగతా 2 లో...

# డ్రగ్స్ మాఫియాకు...
# భారీ షాక్..!

• కోటి యాబై లక్షల రూపాయల విలువ గల గంజాయి పట్టివేత • భద్రాద్రి జిల్లా పోలీసుల సంచలనం • సీక్రెట్ ఛాంబర్ లో దాచిన 304 కేజీల గంజాయి పట్టివేత

## అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 24, ప్రజా జ్యోతి**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, బాధితులకు చెల్లించాల్సిన పరిహారం వంటి అంశాలను సమగ్రంగా సమీక్షించినట్లు తెలిపారు. పోలీస్ శాఖలో ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న 34 అండర్ ఇన్వెస్టిగేషన్ అట్రాసిటీ కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలన్నారు. ప్రతి కేసును పారదర్శకంగా, నిబంధనల ప్రకారం విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. అత్యాచారానికి గురైన మహిళలకు భరోసా కల్పించేందుకు భరోసా కేంద్రం ద్వారా అవసరమైన సహాయం, మానసిక ధైర్యం అందేలా చూడాలని సూచించారు. అలాగే పాఠశాల స్థాయిలోనే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు యుడైస్ సమాచారం ఆధారంగా

మిగతా 2 లో...

## పాండురంగాపురం రైతు వేదికలో సొమ్ములు పోయిన చక్కదిద్దేదేవరో...?

**- రైతు వేదికను సందర్శన....విజిట్ తో అధికారులు కాలయాపన.**

**- చోరీపై నిజం నిగ్గు తేలేదేన్నాడో.**





**పాల్వంచ (టౌన్),డిసెంబర్ 16 (ప్రజా జ్యోతి):** పాండురంగాపురం గ్రామపంచాయతీలో ఉన్న రైతు వేదికలో ప్రభుత్వం ప్రజాల కోసం ఏర్పాటు చేసిన రైతు వేదికలో వస్తువులు చోరీ జరిగి నెలలు గడుస్తున్న అధికారులో మాత్రం స్పందన కనిపించటం లేదు.జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు మాత్రం విచారణ పేరు తో కాలయాపనను కొనసాగిస్తున్నారు.చోరీ జరిగిన 45 రోజులు అవుతున్న జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు చోరీ పై( ఎఫ్ఐఆర్) ఎప్పటికి చేపించకపోవడం ఆలోచించదగిన విషయం.జిల్లాలో జరుగుతున్న

మిగతా 2 లో...

## భార్యపై కత్తితో...
# భర్త కిరాతక దాడి

**- పాత మార్కెట్ వద్ద నడిరోడ్డుపై గొంతు కోసిన వైనం**

**- క్రిస్మస్ బట్టలు కొనేందుకు వస్తే ఘాతుకానికి పాల్పడ్డ భర్త**

**భద్రాచలం, డిసెంబర్ 24,ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలో బుధవారం పట్టపగలే దారుణం చోటుచేసుకుంది. పాత మార్కెట్ సమీపంలోని విద్యుత్ కార్యాలయం వద్ద ఓ వ్యక్తి తన భార్యపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి, ప్రాణాపాయ స్థితికి గురిచేశాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కుటుంబ కలహాలే కారణం దుమ్ముగూడెం మండలం పులిగుండాల గ్రామానికి చెందిన సోడి సత్యం, సోడి లక్ష్మి దంపతుల మధ్య గత కొంతకాలంగా



మిగతా 2 లో...

## అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు స్థితిగతులపై సమగ్ర నివేదికలు అందించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ యువత ఉపాధి అవకాశాలు పెంపొందించుకునేలా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని, వాటిపై క్షేత్రస్థాయిలో కమిటీల ద్వారా యువతకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ క్రమంలో జనవరి 18, 19 తేదీల్లో కమిటీ సభ్యులను హైదరాబాద్ శిక్షణ కేంద్రాలు, పాల్వంచలోని చరిత ఆర్గానిక్ ఫారం, పట్టుపురుగుల పరిశ్రమ, లోతువాగులోని సమీకృత వ్యవసాయం, మోరంపల్లి బంజర మోడల్ ఫామ్ హౌస్, మిట్టగూడెం చేపల పెంపకం యూనిట్ లకు అధ్యయన సందర్శనకు తీసుకువెళ్లాలని అధికారులను ఆదేశించారు, అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో చట్టపరమైన అన్ని నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. బాధితుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, కేసుల విచారణలో ఎలాంటి అలసత్వం వహించబోమన్నారు. బాధితులు న్యాయం పొందే వరకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని, అవసరమైతే ప్రత్యేకంగా మానిటరింగ్ చేస్తామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, సూపర్డెంట్ హనుమంతరావు, సీనియర్ సహాయకులు ప్రసాద్, జిల్లా విజిలెన్స్ అండ్ మహా ఎడిటింగ్ కమిటీ సభ్యులు సామ్యా నాయక్, లకావత్ వెంకటేశ్వర్లు, లక్ష్మీబాయి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీస్ స్టేషను తనిఖీ చేసిన డీఎస్పీ

(మొదటి పేజీ తరువాయి...)

ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై నిత్యం పట్టణ ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ నెల చివరి వారంలో స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో తమ వంతు భాద్యతలను నిర్వర్తించాలని, రాంగ్ రూట్, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ లకు పాల్పడే వారికి జరిమానాలు విధించాలని అన్నారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు, సిబ్బంది ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్ ను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ విధుల పట్ల నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవలందించాలని కోరారు. పోలీస్ స్టేషన్లో అధికారులు, సిబ్బందితో సెమీ క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం 3టౌన్ సీఐ శివప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## భార్యపై కత్తితో భర్త కిరాతక దాడి

(మొదటి పేజీ తరువాయి...)

కుటుంబ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్పర్థలు రావడంతో లక్ష్మి గత ఐదు నెలలుగా భద్రాచలం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న తన బంధువుల ఇంట్లో నివాసం ఉంటున్నారు. గురువారం క్రిస్మస్ పండుగ కావడంతో, తన కుమారుడికి కొత్త బట్టలు కొనుగోలు చేయడం కోసం లక్ష్మి పట్టణానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న భర్త సత్యం, పాత మార్కెట్ వద్ద ఆమెను అడ్డగించాడు. తొలుత భార్యాపిల్లలతో మాయమాటలు చెబుతూ నమ్మబలికిన సత్యం.. ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న కత్తితో లక్ష్మి పొట్టలో బలంగా పొడిచాడు. అంతటితో ఆగకుండా గొంతు కోసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. రక్తపు మడుగులో పడి ఉన్న బాధితురాలిని చూసిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. ఆమెను చికిత్స నిమిత్తం భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. లక్ష్మి పరిస్థితిని పరీక్షించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ, పొట్ట భాగంలో గాయం తీవ్రంగా ఉండటంతో అత్యవసర శస్త్రచికిత్స కోసం ఆపరేషన్ థియేటర్ కు తరలించినట్లు తెలిపారు. ఘటన గురించి సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని బాధితురాలి వివరాలను సేకరించారు. నిందితుడు సత్యంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. పట్టపగలే రద్దీగా ఉండే ప్రాంతంలో జరిగిన ఈ దాడితో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.



# డ్రగ్స్ మాఫియాకు భారీ షాక్..!

(మొదటి పేజీ తరువాయి...)





దాచిపెట్టినట్లు గుర్తించారు. పోలీసుల తనిఖీల్లో మొత్తం 152 గంజాయి పాకెట్లు లభ్యమయ్యాయి. ఒక్కొక్కటి సుమారు 2 కిలోల బరువు కలిగి ఉండగా, మొత్తం 304 కేజీల నికర బరువు గల ఈ నిషేధిత గంజాయి విలువ సుమారుగా రూ.1 కోటి 52 లక్షలుగా అంచనా వేయబడింది. పోలీసుల కంట పడకుండా ఉండేందుకు ఎస్కార్ట్ వాహనంగా ఉపయోగించిన ఎర్టిగా కారుకు నకిలీ నెంబర్ ప్లేట్ అమర్చినట్లు కూడా గుర్తించారు. అసలు నెంబర్ యం హెచ్ 14 ఇ సి 5834 కాగా, దాని స్థానంలో ఎ పి 14 ఇ సి 5834 అనే ఫేక్ నెంబర్ ప్లేట్ వాడినట్లు తేలింది. విచారణలో నిందితులు వెల్లడించిన కీలక విషయాలు మరింత షాక్ కు గురి చేస్తున్నాయి. ఈ గంజాయిని ఒరిస్సా రాష్ట్రం చిత్రకొండ ప్రాంతానికి చెందిన సాదు గురుజి వద్ద కొనుగోలు చేసి, తొలుత కారులో రాజమండ్రి వరకు తరలించి, అక్కడి నుంచి లారీ కంటైనర్ లోని సీక్రెట్ ఛాంబర్ లో దాచి, రాజమండ్రి – అశ్వారావుపేట – సతుపల్లి – విజయవాడ మార్గంగా చెన్నైకి చెందిన డ్రగ్స్ రిసీవర్ విక్రమ్ వద్దకు తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. ఈ విధంగా పక్కా ప్రణాళికతో, పోలీసుల కళ్లను మాయ చేసి అంతర్ రాష్ట్ర డ్రగ్స్ రవాణా కొనసాగిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో లారీలో ఉన్న ఇద్దరు వ్యక్తులు, ఎస్కార్ట్ కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై యన్ డి పి యస్ చట్టం కింద దమ్మపేట పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెంబర్. 326/2025గా కేసు నమోదు చేశారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన లారీ, ఎర్టిగా కారు, ఐదు మొబైల్ ఫోన్లుతో పాటు వారి వద్ద ఉన్న రూ.4,500 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు సంబంధించిన ప్రధాన సప్లయర్, రిసీవర్, వాహన యజమానులు పరారీలో ఉండగా, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ రోజు పట్టుబడిన నలుగురు నిందితులను జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. భారీ స్థాయిలో సాగుతున్న గంజాయి అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకుని, పక్కా సమాచారంతో, చాకచక్యంగా నిందితులను పట్టుకున్న అశ్వారావుపేట సీఐ నాగరాజు, దమ్మపేట ఎస్ ఐ సాయి కిషోర్ రెడ్డి, తెలంగాణా ఈగల్ ఫోర్స్ ఖమ్మం, సిబ్బందిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐ పి యస్ ప్రత్యేకంగా అభినందించారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం మరింత కఠిన చర్యలు చేపడుతుందని ఎస్పీ స్పష్టం చేశారు.

## పాండురంగాపురం రైతు వేదికలో సొమ్ములు పోయిన చక్కదిద్దేదేవరో.....?

(మొదటి పేజీ తరువాయి...)

పరిణామాలన్నీ జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారికి తెలుసా.....? చోరీ జరిగిన నెల పదిహేను రోజులో ఏఈఓ నిధులుకు సరిగా హాజరు రాకపోగా డిసెంబర్ నెలలో లాంగ్ లీవ్లోకి వెళ్లడం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామ రైతులు. ఒక గ్రామ పంచాయతీలో ఉన్న రైతు వేదిక ఇలా ఉంటే, జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారుల పరిధి స్థాయిలో ఉన్నటువంటి రైతు వేదికల పరిస్థితి ఏంటీ......? జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారి రైతు వేదికలు పర్యవేక్షిస్తున్నారా. పర్యవేక్షణలోనే ఉంటే పోయినటువంటి వస్తువుల పరిణామం ఏంటి......? మండల అగ్రికల్చర్ ఆఫీసర్స్ పరిధిలో ఉన్న అగ్రికల్చర్ ఎక్సటెన్షన్ ఆఫీసర్ల(ఏఈఓ) రైతు నివేదిలో నైతికంగానే నిధులు నిర్వహిస్తున్నారా. ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన రైతు వేదిక నుండి సంక్షేమ పథకాలు రైతులకు చేరుతున్నాయా ఆలోచించదగ్గ విషయం.....? మరో పక్కన రాష్టంలో యూరియా అవస్థలు పడుతూ పంటలు పండిస్తే పంట చేతికొచ్చి అమ్ముకుందామనే సమయంలో కౌవులు రైతులకు ఏఈఓ(అనురిక) అందుబాటులో లేకపోవడం రైతులకు తీరని లోటుని కలగజేస్తుందన్ని రైతులు చెపుతున్నారు. రైతు వేదికలో వస్తువులు పోయినాయి తరువాత పరిధిలోని స్టేషన్లో కేసు ఎందుకు నమోదు చేయలేదు. మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఎం చేస్తున్నారు....? ఎంఏవో కేసు నమోదు చేపించడానికి ప్రయత్నాలు చేశారా, చేస్తే ఏదైనా శక్తి అడ్డుపడ్డాదా, ఆడుపాడిన శక్తినే ఏఈఓ కు కొమ్ముఖస్తుందా తెలియాల్సి ఉంది. రైతు వేదిక చోరిలో రూరల్ బి.సురేష్ (ఎస్ఐ) కేసు నమోదు చెయ్యకపోగా. ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టుకోలేడనే, అనే ఉదంతాన్ని ఇచ్చారు. దొంగతనం జరిగి నెలలు అవుతున్న జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారి పట్టింపేకరువైంది. పాండురంగాపురం రైతు వేదికలో జరిగిన చోరీలో అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్టుగా రైతులు వేదన వ్యక్తపరుస్తున్నారు. చోరీ జరిగేనా రోజున సమీప జగన్నాధపురం రైతు వేదికలో డిఏవో & ఎడిఏ అధికారులు రైతు నేస్తం కార్యక్రమం లో ఉన్నారనే సమాచారం. అయినా చోరీ జరిగేనా సంఘటన స్థలానికి సందర్శించపోవడం. అలాగే చోరీ పై స్పందిచ్చకపడం ఆచార్యకరమైన విషయం. దొంగతనం జరిగిన తరువాత అధికారులు డిసెంబర్ నెలలో 10న, 16న విచారణ కు హాజరయ్యి వివరణ ఇవ్వాలని శోకాజులు జారీ చేసిన వాట్టిని నిరకరించిన ఏఈఓ(అనురిక), చోరీ పై వివరణ ఇవ్వాల్సి వస్తుందని భయంతో నెలరోజుల పాటు లాంగ్లేవ్ అడిగిన ఏఈఓ.....! లీవ్ అనుమతి ఇచ్చిన జిల్లా ఉన్నతాధికారి. ఈ జిల్లా స్థాయి వ్యవసాయ ఉన్నతాధికారి చోరీ పై స్పందన్న ఎంటి.....? ఎడిఏ వివరణ ఏమన్ని ఆడుగుంటారు. డిఏవో కు సమర్పించిన వివరణ లో ఏముంది.

డిఏవో చోరీపై జరిగిన సంఘటనలో ఏ విధంగా స్పందిస్తున్నారు.

**గ్రామస్తుడైన–రైతు తెలిపిన వివరాలు:**

రైతు వేదికలో జరిగిన చోరీ ఘటనపై స్థానిక గ్రామస్థుడు, రైతు తెలిపిన వివరాల ప్రకారం... నవంబర్ 3వ తేదీ రాత్రి నుంచి 4వ తేదీ మధ్యలో, సాయంత్రం 8 నుంచి 9 గంటల సమయంలో మేము రైతు వేదిక పక్కనే ఉన్న ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నాము. ఆ సమయంలో రహదారి పక్కన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు నిలబడి ఉన్నారు. పాండురంగపురం ప్రధాన రహదారి కావడంతో పెద్దగా అనుమానం కలగలేదు. కొద్దిసేపటి తర్వాత రైతు వేదిక లోపల నుంచి ఒక్కసారిగా బైక్ వెలుతురుతో బయటకు రావడం గమనించాము. బైక్ పై ఇద్దరు వ్యక్తులు ఉండగా, వారి మధ్యలో ఒక టీవీ స్పష్టంగా కనిపించింది. ఆ ఇద్దరూ ఉప్పుసాగ వైపుగా వేగంగా వెళ్లిపోయారు. ప్రభుత్వ సొమ్మును ఇంత సునాయాసంగా ఎత్తుకెళ్లగలుగుతారని మేము ఊహించలేదు. ఇప్పటికే గతంలో హాపర్, ఇన్వర్టర్ మాయమవగా, ఇప్పుడు టీవీ కూడా చోరీకి గురైంది. ఈ చోరీకి పాల్పడిన దొంగలను అధికారులు వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం.

**డిఏవో వివరణ.....**

రైతు వేదిక చోరీపై డీఏవో బాబురావు ప్రజా జ్యోతి వివరణ కోరగా పాండురంగాపురం రైతు వేదికలో చోరీపై విచారణ చేసి బాధితులను పట్టుకొని కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# 'మీ డబ్బు-మీ హక్కు'ను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి. పాటిల్.






**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 24, ప్రజా జ్యోతి**
వివిధ కారణాల వల్ల సంవత్సరాలుగా క్లెయిమ్ చేసుకోకుండా మిగిలిపోయిన ఆర్థికపరమైన ఆస్తులను తిరిగి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'మీ డబ్బు – మీ హక్కు' కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు విస్తృతంగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు.బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో 'మీ డబ్బు – మీ హక్కు' కార్యక్రమంపై వివిధ బ్యాంకులు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో విస్తృతస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మీ డబ్బు – మీ హక్కు' నినాదంతో ఈ కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. ప్రజలకు చెందవలసిన కానీ ఇప్పటివరకు క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు, బీమా పాలసీల రాబడులు, ఇతర ఆర్థిక సంస్థల వద్ద నిలిచిపోయిన మొత్తాలను తిరిగి పొందేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని అన్నారు.బ్యాంకుల్లో 10 సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేయని డిపాజిట్ల వివరాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న 'ఉద్గమ్' వెబ్‌సైట్ ద్వారా తెలుసుకుని, సంబంధిత బ్యాంకులను సంప్రదించడం ద్వారా సులభంగా క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో సుమారు రూ.46 కోట్ల మేర అన్‌క్లెయిమ్ డిపాజిట్లు ఉన్నాయని కలెక్టర్ వెల్లడించారు. ఈ మొత్తాలు తిరిగి ప్రజలకు చేరితే వారి ఆర్థిక భద్రతకు, కుటుంబాల సంక్షేమానికి ఎంతో దోహదపడతాయని అన్నారు.ప్రజల్లో అవగాహన మరింత పెంచేందుకు ఏపీఎం పరిధిలోని సీసీలు, మహిళా సమాఖ్య సభ్యులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు గ్రామ స్థాయిలో ఇంటింటి ప్రచారం చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులు, మహిళలు, నిరక్షరాస్యులు ఈ అవకాశాన్ని కోల్పోకుండా అవసరమైన సహాయం అందించాలని సూచించారు.అలాగే ప్రభుత్వ శాఖల్లో పేరుకుపోయిన అన్ని అన్‌క్లెయిమ్ డిపాజిట్లను డిసెంబర్ 31లోపు తప్పనిసరిగా క్లియర్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తి చేయకపోతే సంబంధిత శాఖాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. అన్ని శాఖలు తమ పరిధిలో ఉన్న అన్‌క్లెయిమ్ డిపాజిట్ల పూర్తి వివరాలను సమగ్ర నివేదికల రూపంలో జిల్లా పరిపాలనకు సమర్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ బ్యాంకుల్లో ఉన్న అన్‌క్లెయిమ్ డిపాజిట్లను విజయవంతంగా క్లెయిమ్ చేసుకున్న కుంజ భద్రమ్మ, కందుల మనమ్మ, గొప్పన బాలమ్మ, మిట్టపల్లి అహల్య, తోట అపర్ణ, సిహెచ్. పాండురంగారావు తదితర లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా చెక్కులను అందజేశారు.అదేవిధంగా ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో వివిధ శాఖలు, బ్యాంకులకు సంబంధించిన అన్‌క్లెయిమ్ డిపాజిట్ల ఫారములు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, అక్కడే దరఖాస్తుల పరిశీలన, మార్గదర్శనం అందించారు. ప్రజలకు అవసరమైన పత్రాలు, ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, రిజర్వ్ బ్యాంక్ ఎల్డీఓ శ్రీనివాస్, ఎస్బీఐ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, నాబార్డ్ డీడీఎం సుజిత్ కుమార్, యూనియన్ బ్యాంక్ డీజీఎం హనుమంత్ రెడ్డి, డిజిపి రీజినల్ మేనేజర్ నాగరాజు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు, వినియోగదారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎయిర్ టెల్ నెట్ కేబుల్ కోసం అడ్డగోలుగా తవ్వుతున్న సిసి రోడ్లు

- సిపిఎం ఆధ్వర్యంలో అడ్డుకున్న కాలనీ ప్రజలు
- పరిశీలించిన గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ
- తక్షణమే తవ్వకాలు ఆపాలని సర్పంచ్ కు సిపిఎం వినతి



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 24(ప్రజాజ్యోతి)** ఎయిర్ టెల్ కంపెనీ ఇంటర్నెట్ కేబుల్ ను అండర్ గ్రౌండ్ నుండి వేసేందుకు సీసీ రోడ్లు అక్రమంగా తవ్వడాన్ని సిపిఎం ఆధ్వర్యంలో 20వ వార్డులోని ఎంపీ కాలనీ ప్రజలు అడ్డుకున్నారు. అడ్డగోలుగా సిసి రోడ్లు పగలగొట్టడం తోపాటు మిషన్ భగీరథ పైపులైన్లు కూడా డ్యామేజ్ అవుతున్న పరిస్థితిని గమనించిన సిపిఎం నాయకులు స్థానిక ప్రజలు పనులను అడ్డుకొని గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావుకు, సర్పంచ్ పూనెం కృష్ణ కు తెలియపరచగా సర్పంచ్ పూనెం కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకోవడంతో సర్పంచుకు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. సర్పంచ్ పూనెం కృష్ణ సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడి తక్షణమే పనులు నిలుపుదల చేయాలని తవ్విన గోతులు పూడ్చి, పగలగొట్టిన సిసి రోడ్డును పకడ్బందీగా నిర్మించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి సిపిఎం వార్డ్ మెంబర్ జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు లు మాట్లాడుతూ అడ్డగోలుగా సిసి రోడ్లు పగలగొట్టి కేబుల్ వైర్లు వేయటానికి పర్మిషన్లు ఇవ్వడానికి వీలు లేదని అన్నారు. అనివార్యంగా ఇలాంటి పనులు చేయవలసిన పరిస్థితి వస్తే సంబంధిత అధికారులు దగ్గర ఉండి ప్రభుత్వ, ప్రజల ప్రాపర్టీకి నష్టం జరగకుండా పనులు చేయించాలే తప్ప కాంట్రాక్టర్లకు వదిలివేయడానికి వీలు లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు కోరాడ శ్రీనివాస్ 17వ వార్డు జోన్ కన్వీనర్ డి రామకృష్ణ స్థానిక పార్టీ నాయకులు పుష్పలత, ఎస్.కె నభి, యాకుబీ,సత్య, జి. కోటేశ్వరరావు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్ హిందువులకు రక్షణ కల్పించాలి

- కలెక్టరేట్ ఎదుట విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నిరసన.

**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 24(ప్రజా జ్యోతి):** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింస,మారణహోమాలకు నిరసనగా బుధవారం నాడు పాల్వంచలోని జిల్లా కలెక్టరేట్ వద్ద విశ్వహిందూ పరిషత్,బజరంగ్‌దళ్, దుర్గావాహిని ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యకర్తలు కలెక్టర్ కార్యాలయంలోని పరిపాలన అధికారికి వినతిపత్రం సమర్పించారు. "బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి,అక్కడ జరుగుతున్న మతోన్మాద దాడులను యావత్ ప్రపంచం ఖండించాలి" అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర మందిర అర్చక పురోహిత్ సహ ప్రముఖ్ వోరుగంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ,బంగ్లాదేశ్లో హిందువులపై జరుగుతున్న దాడులపై భారత ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.అవసరమైతే ఆపరేషన్ సింధూర్ లాంటి చర్యలకు కూడా కేంద్ర ప్రభుత్వం పూనుకోవాలని విశ్వహిందూ పరిషత్ కోరుతోందన్నారు.ఈ నిరసనలో విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు,విభాగ్ మాతృశక్తి సంయోజిక రేగడి విజయలక్ష్మి,జిల్లా ఉపాధ్యక్షులు రామాయణం శర్మ,దారా రమేష్,జిల్లా సంఘటన కార్యదర్శి గంగాధరి సీత,జిల్లా బజరంగ్‌దళ్ సంయోజక్ కూసన సాగర్,జిల్లా సహ సంయోజక్ మధుసూదన చారి,జిల్లా దుర్గావాహిని సంయోజిక గంగాధరి ఇందుమతి,సహ సంయోజిక గొడ్ల ఇందుమతి,జిల్లా బాల సంస్కార కేంద్ర ప్రముఖ్ గొడ్ల సాయిశ్రీ,జిల్లా సామాజిక సమరసతా ప్రముఖ్ గొడ్ల రాజయ్య,కొత్తగూడెం నగర సంయోజక్ కిరణ్,పాల్వంచ ప్రఖండ సంయోజక్ రామగిరి ప్రసాద్,ప్రఖండ కార్యదర్శి దాసరి మాధవ రావు,ఉపాధ్యక్షులు చల్లా లింగన్న,మాతృశక్తి సంయోజిక మందా వెంకటరమణ, ప్రఖండ మందిర అర్చక పురోహిత్ ప్రముఖ్ రాజాచార్యులు,భద్రాచలం ప్రఖండ అధ్యక్షులు తాటిపాముల తిరుపతి రావు,కార్యదర్శి కొమర్రాజు నాగేశ్వరరావుతో పాటు కొత్తగూడెం,పాల్వంచ పట్టణాల బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.




## సర్పంచ్‌గా ఎన్నికైన జరుపుల కాశమ్మకి ఘన సన్మానం



**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 24(ప్రజా జ్యోతి):** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బసవతారక కాలనీ సర్పంచ్‌గా ఘన విజయం సాధించిన జరుపుల కాశమ్మాను కాలనీ మహిళలు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మహిళలు పూలమాలలు,శాలువాలతో సర్పంచ్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.గ్రామ అభివృద్ధి,మహిళల సంక్షేమం,మౌలిక వసతుల మెరుగుదల కోసం కృషి చేస్తానని సర్పంచ్ జరుగును కాసముకు హామీ ఇచ్చారు.మహిళల సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరించి కాలనీని ఆదర్శంగా నిలబెడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా సంఘాల సభ్యులు,కాలనీ పెద్దలు, యువత పాల్గొని సర్పంచ్‌కు మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది.

## మూడో వార్డు సభ్యుడిగా భానోత్ వీరేందర్ కుమార్ ప్రమాణ స్వీకారం



**పాల్వంచ(టౌన్),డిసెంబర్24 (ప్రజా జ్యోతి):** 14న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో పాండురంగాపురం తండా మూడో వార్డు సభ్యుడిగా ఎన్నికైన భానోత్ వీరేందర్ కుమార్ చేత గ్రామపంచాయతీ కార్యదర్శి గూగులోత్ కాళీ ప్రమాణ స్వీకారం చేయించారు.ప్రమాణ స్వీకారం అనంతరం భానోత్ వీరేందర్ కుమార్ మాట్లాడుతూ,తనపై నమ్మకం ఉంచి గెలిపించిన మూడో వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం,ముఖ్యంగా తన వార్డు ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని, నీతి–నిజాయితీలతో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుగులోతు బాలు,సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుండాల నాగరాజు, బుక్య హుస్సేన్ నాయక్, సేవలాల్ సేన జిల్లా అధ్యక్షులు బద్రు నాయక్,యువసేన జిల్లా అధ్యక్షులు భరత్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ నాగేష్, బానోతు రవి నాయక్,లక్ష్మణ్ నాయక్,పిసా మొబైల్ ఇస్లావతులాలు,రాజా, జబ్రులాల్,తులసి రామ్ నాయక్,కుమారస్వామి, జక్కుల సురేష్,రాజేందర్, శ్యామ్,భూక్య మంగ్యా నాయక్,రాజు స్వామి తదితరులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి మారథాన్‌లలో తహసీల్దార్ ప్రతిభ

**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 23(ప్రజా జ్యోతి):** పాల్వంచ తహసీల్దార్ దారా ప్రసాద్ జాతీయ స్థాయి మారథాన్‌లలో క్రమం తప్పకుండా పాల్గొంటూ,ప్రోక్యామ్ స్లామ్ రన్నర్గా గుర్తింపు పొందారు.ఆయన ప్రతిరోజూ ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో పరుగుల సాధన చేస్తుంటారు.2021లో సహచరుడు శ్రీనివాస్,ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుల్ పిల్లి రాజు ప్రోత్సాహంతో ఆయన పరుగుల సాధన ప్రారంభించారు.అథ్లెటిక్స్‌తో సంబంధం లేదని మొదట్లో సందేహించినప్పటికీ,క్రమశిక్షణతో సాధన చేస్తూ ముందడుగు వేశారు.ఇటీవల ఆయన 42.195 కిలోమీటర్ల ఎన్ఎండీసీ హైదరాబాద్ ఫుల్ మారథాన్,అలాగే 42.195 కిలోమీటర్ల టాటా ముంబై ఫుల్ మారథాన్ 2025లను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రోక్యామ్ స్లామ్ రన్నర్గా నిలవడం తనకు గర్వకారణమని ఆయన తెలిపారు.ఇప్పటివరకు దేశవ్యాప్తంగా జరిగిన స్థానిక,జాతీయ స్థాయి మారథాన్‌లలో పాల్గొని 22 పతకాలు సాధించినట్లు చెప్పారు.శారీరక దృఢత్వం కోసం ప్రతి ఒక్కరూ రోజూ పరుగుల సాధన అలవాటు చేసుకోవాలని ప్రజలకు దారా ప్రసాద్ సూచించారు.






## బిజెపి వైఖరిపై ఆందోళనలు చేపట్టాలి

- మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితారావు




**ఇల్లెందు, డిసెంబర్ 24, ప్రజాజ్యోతి:** హైదరాబాద్ లో ఇందిర భవన్ లో ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆల్కాళంభ ఆదేశాలతో బుధవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితరావు అధ్యక్షతన ఎక్జిక్యూటివ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల మహిళా నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, మహిళా కాంగ్రెస్ నాయకులు చేస్తున్న పనులు మొదలగు వాటి గురించి చర్చించారు. కేంద్ర ప్రభుత్వం 2005లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం పేరు మార్పుపై జిల్లాలో మహిళా కాంగ్రెస్ ధర్నాలు, నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోచికొండ శ్రీదేవి, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



**టేకులపల్లి,డిసెంబర్24,ప్రజాజ్యోతి:** మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సప్పిడి రవీందర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శాంతికి, సంతోషానికి చిహ్నం క్రిస్మస్ పండుగ అని, భారతదేశం మతసామరస్యానికి ప్రతీకఅన్నారు. జీసస్ శాంతికి ప్రతిరూపమని అలాంటి వారి నుంచి అందరు తమకు చెడు చేసినా మంచిని పంచే తత్వా ప్రతి ఒక్కరు అలవాటు చేసుకోవాలన్నారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్ సి ఓ బి. రాంబాబు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసిఒ బ్యూలా రాణి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న తాసిల్దారు వీరభద్రం



**టేకులపల్లి,డిసెంబర్24, ప్రజాజ్యోతి:** టేకులపల్లి తాసిల్దారు వీరభద్రం టేకులపల్లి లోని బుధవారం మరనాత టెంపుల్లో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆయన చూపిన బాట అందరికీ రక్షణగా ఉంటుందని నేను నమ్ముతాను.పాపులను సైతం క్షమించాలని బైబిల్ చెబుతుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో టేకులపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ప్రెసిడెంట్ పాస్టర్ గూగులోతు రాజు రామ్ చందర్,సెక్రటరీ పాస్టర్ టీ. బోయాస్,వైస్ ప్రెసిడెంట్ ఉండం నరేష్, జాయింట్ సెక్రెటరీ ఎం మార్కు,సభ్యులు బి అబ్రహం, సలహాదారులు ఎం దావీదు,సిస్టర్స్ తారా బాయి,స్వతంత్ర, మరియమ్మ, సోనెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వామన రూపుడైన వరాల రామయ్య

- భద్రగిరిలో వైభవోపేతంగా సాగుతున్న అధ్యయనోత్సవాలు
- నేడు పరశురామావతారంలో దర్శనం



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 24(ప్రజాజ్యోతి)** బలి చక్రవర్తి గర్వాన్ని అణిచేందుకు వెలసి మూడడుగుల స్థలాన్ని కోరి రాక్షసరాజుకు గర్వభంగం చేసిన వామనావతారంలో దర్శన మిచ్చిన భద్రాద్రి రామయ్యకు భక్తులు జేజేలు పలికారు. భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు బుధవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య స్వామిని వామనావ తారంలో అలంకరించారు. తొలుత గర్భ గుడిలో సుప్రభాత సేవ నిర్వహించి ఆరాధన గావించారు.. అర్చక స్వాములు పూజల నడుమ వేద పండితులు పాశురముల ప్రబంధాలను పం చారు. వామనావతారంలో అలంకరించిన స్వామి వారికి బేడా మండపంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి ఊరేగింపుగా మహిళ లు కోలాట ప్రదర్శనల నడుమ మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. ప్రత్యేక వేదికపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకున్న భక్తులు నీరాజనాలు పలికారు. ఆర్చ





కులు ఆశీర్వచనాలు అందజేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం వామనావతారంలో దర్శనమిస్తున్న స్వామివారు, పక్కన ఆళ్వార్లు స్వామివారికి తిరువీధి సేవ జరిపి తిరిగి ఆలయా నికి తీసుకొచ్చాడు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, ఏఈవో శ్రావణ్‌కుమార్, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

### ♦ నేడు పరశురాముడిగా..

వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం పరశురామావతారం లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శ్రీ మహావిష్ణువు జమదగ్ని అనే మహర్షికి పుత్రుడి గా జన్మించి పరశురాముడు (భార్గవరాముడు) అని పిలవబడుతూ దుష్టులైన కార్త వీర్యార్జు నుని, దుర్మార్గులైన రాజులను 21 సార్లు దండె త్తి సంహరించి ధర్మాన్ని స్థాపించాడు. శుక్ర గ్రహ బాధలున్నవారు ఈ అవతారాన్ని దర్శిస్తే శుభ ఫలితాలు పొందుతారని ప్రతీతి.


## సింగరేణి సెక్యూరిటీ ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు




**కొత్తగూడెం (సింగరేణి), డిసెంబర్ 24, ప్రజా జ్యోతి** కొత్తగూడెం ఏరియా సింగరేణి సెక్యూరిటీ డిపార్ట్మెంట్ పరిధిలో సెమి క్రిస్మస్ వేడుకలు ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ ఆదేశాల మేరకు, కమిటీ సభ్యుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్ మాట్లాడుతూ, అన్ని మతాలు ఒకటేనని, మనమంతా ఒకే యూనిఫాం ధరించి పనిచేస్తున్నాం కాబట్టి మనమంతా ఒక్కటేనని పేర్కొన్నారు. ఐక్యత, పరస్పర గౌరవంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.సీనియర్ అసిస్టెంట్ మోహన్ రెడ్డి కూడా ఇదే భావనను వ్యక్తం చేస్తూ, ఉద్యోగుల మధ్య సౌహార్దం మరింత బలపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ జిమెదార్ కమల్ సింగ్, విక్టర్ కమిటీ సభ్యులు గాడ్స్ మల్లికార్జున్, హనూక్ రాజ్, జనార్ధన్, రమేష్ బాబు, సురేష్, బాబు, అశోక్, శ్రీనివాస్‌లతో పాటు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది నూకరాజు, జోసెఫ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.అలాగే ఇతర గార్డుల సహకారంతో వేడుకను విజయవంతంగా నిర్వహించారు.

## క్రిస్మస్ కు ముస్తాబైన చర్చీలు నేటి నుండి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

**టేకులపల్లి,డిసెంబర్24,ప్రజాజ్యోతి:** క్రీస్తు జయంతి సందర్భంగా సులానగర్ ఆర్ సి ఎం చర్చిని ముస్తాబు క్రైస్తవులు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఏసుక్రీస్తు జన్మదినమైన డిసెంబరు 25న క్రైస్తవ సోదరులు ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారు. అంతేకాకుండా ఏసుక్రీస్తు అర్ధరాత్రి పశువుల పాకలో జన్మించినందున ప్రతి చర్చి ముందు పశువుల పాకను ఏర్పాటు చేసి ఏసుక్రీస్తు పుట్టుకకు సంబంధించిన చిత్రాలను ఏర్పాటు చేశారు.ఏసుక్రీస్తు పుట్టినప్పుడు నక్షత్రం కనిపించింది.దీనికి గుర్తుగా క్రైస్తవ సోదరులు తమ తమ నివాసాలపై విద్యుత్ కాంతులతో క్రిస్మస్ ట్రీని, స్టార్ ను ఏర్పాటు చేసుకొని పండుగ ఉత్సవాలను ప్రారంభించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవ సోదరులందరూ నూతన దుస్తులను ధరిస్తారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో ఉన్న ముఖ్యమైన నాయకులు పాల్గొని క్రీస్తు జయంతి సందర్భంగా కేకులు కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు ఒకరికొకరు తెలియజేసుకుంటారు.





## ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం..!

- రూప్ల తండాలో ఘోర అగ్నిప్రమాదం..
- పూర్తిగా కాలిన భూక్య లాలు ఇల్లు..
- కట్టుబట్టలతో మిగిలిన కుటుంబం

**సుజాతనగర్, డిసెంబర్ 24, ప్రజా జ్యోతి**సుజాతనగర్ మండలం కొత్త అంజనాపురం గ్రామపంచాయతీ పరిధిలోని రూప్ల తండా గ్రామంలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదం గ్రామాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. భూక్య లాలు నివాసం, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు పూర్తిగా దగ్ధమైంది.ఇంట్లో నుంచి మంటలు చెలరేగినట్లు గమనించిన గ్రామస్థులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఇల్లు మొత్తం మంటల్లో చిక్కుకుని ఉండటంతో ఏ వస్తువును కూడా కాపాడలేకపోయిన పరిస్థితి నెలకొంది. ఈ అగ్నిప్రమాదంలో ఇంట్లో



ఉన్న గృహోపకరణాలు, వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్, బీరువాలు, టేకు డబుల్ కాట్ మంచంతో సహా రోజు వారీ అవసరాల వస్తువులన్నీ కాలి పోయినట్లు బాధితులు తెలిపారు. అదేవిధంగా వారి పిల్లలకు సంబంధించిన ఒకటవ తరగతి నుంచి డిగ్రీ వరకు ఉన్న విద్యా సర్టిఫికెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. అలాగే సుమారు రూ.5 లక్షల విలువైన నగదు, రెండు తులాల బంగారం, 10 తులాల వెండి కూడా మంటల్లో నష్టపోయినట్లు సమాచారం.ఈ ఘటనతో భూక్య లాలు కుటుంబం కేవలం కట్టుబట్టలతోనే మిగిలింది. ఒక్కసారిగా జరిగిన ఈ అగ్నిప్రమాదం కుటుంబాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన చేపట్టారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనపై గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందించాలని కోరుతున్నారు.

# నక్సల్స్ డంప్‌ను స్వాధీనం




**చర్ల, డిసెంబర్ 24 (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలోని క్యాంప్ మెటగూడ ప్రాంతంలో నక్సలైట్లు దాచిన భారీ మొత్తంలో ఆయుధాలు పేలుడు పదార్థాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. జిల్లాలో నిరంతరం నిర్వహిస్తున్న నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కారణంగా నక్సల్ సంస్థ భారీ నష్టాలను చవిచూసింది, భవిష్యత్తులో కూడా ఈ ఆపరేషన్ కొనసాగుతుంది. మావోయిస్టులకు ఒకే ఒక ఎంపిక ఉంది, హింసను విడిచిపెట్టి శాంతి అభివృద్ధి మార్గాన్ని స్వీకరించి పూనా మార్ఘెమ్ పునరావాసం నుండి పునరుజ్జీవన ప్రచారంలో భాగంగా జనజీవన స్రవంతి లోకి రావటం అని అధికారులు అన్నారు .నక్సలైట్ల డంప్ స్వాధీనం చేసుకునే ఆపరేషన్‌లో డి /203 కోబ్రా , 131 బి యెన్ సి ఆర్ పీ ఎఫ్ , డిస్ట్రిక్ట్ ఫోర్స్ సుక్మా సంయుక్త చర్యలో సీనియర్ అధికారుల ఆదేశాల మేరకు సుక్మా జిల్లాలో నక్సలైట్ నిర్మూలన ఆపరేషన్ నిర్వహిస్తున్న సమయంలో నక్సలైట్స్ ఉనికి గురించి సమాచారం అందిన తరువాత, మంగళవారం డి /సి ఓ వై 203 కోబ్రా , 131 బి యెన్ సి ఆర్ పీ ఎఫ్ మరియు డిస్ట్రిక్ట్ ఫోర్స్ సుక్మా సంయుక్త బృందం క్యాంప్ మెటాగూడ నుండి విలేజ్ పినాచండ, బోటెటాంగ్ సమీపంలోని అటవీ కొండల వైపు నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ కోసం బయలుదేరింది. ఈ ఆపరేషన్ సమయంలో మంగళవారం ఉదయం, భద్రతా దళాలకు భారీ నష్టం కలిగించే ఉద్దేశ్యంతో నక్సలైట్లు దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు ఇతర నక్సలైట్ పదార్థాలతో సహా భారీ మొత్తంలో డంప్ చేయబడిన పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ విధంగా మావోయిస్టుల ప్రణాళికలను భద్రతా దళాలు భగ్నం చేశాయి. ఆపరేషన్ తర్వాత మొత్తం పార్టీ సురక్షితంగా శిబిరానికి తిరిగి వచ్చింది.

- **నక్సలైట్ల నుండి స్వాధీనం చేసుకున్న డంప్ మెటీరియల్ వివరాలు:**

ఎయిర్ గన్ – రెండు (విరిగిన దాని బట్) బట్ ప్లేట్ – రెండు రైఫిల్ బోల్ట్ ఒకటి ఎలక్ట్రిక్ డిటోనేటర్ – ఒకటి ,ఐ ఈ డి స్టీల్ కంటైనర్ (సామర్థ్యం 5 లీటర్లు 3 లీటర్లు) – రెండు , ఐ ఈ డి స్ప్లింటర్లు – 02 కిలోలు బి జి ఎల్ తోక (పేలింది) – ఒకటి , బి జి ఎల్ తల – ఏడు , బి జి ఎల్ తోక టోపీ – 26 ,స్టీల్ రాడ్ (2 అడుగులు) – ఒకటి , బ్రాస్ రాడ్ (57 సెం.మీ, 70 సెం.మీ, 32 సెం.మీ, 39 సెం.మీ, 47 సెం.మీ, 42 సెం.మీ) –ఆరు సంఖ్యలు , స్క్రూ (1 అంగుళం) – 02 కిలోలు , స్పైక్ రాడ్ – 40 సం. , బి జి ఎల్ తయారీకి స్థూపాకార పైపులు (20ఎం ఏం , 40ఎం ఏం , 70ఏం ఏం , 100ఎం ఏం ) – 11 ,ఇనుప పికెట్ (1.5 అడుగులు) – రెండు , పీ సి బి – నాలుగు , హెక్సా బ్లేడ్ – ఐదు , మైక్రోటెక్ ఇన్వర్టర్ (4.20ఏ ) – ఒకటి నం. ,హెచ్ పీ ప్రింటర్ – ఒకటి , హిందూస్తాన్ యూనిలీవర్ ప్యూరిట్ ఆర్ ం (ఫిల్టర్ అడాప్టర్‌తో సహా) – ఒకటి ,నాలుగు . నీటి సరఫరా పంపు (కనెక్టింగ్ పైపు మరియు వాల్వ్‌తో సహా) – ఒక సెట్. కాస్ట్రోల్ ఆర్ ఏక్స్ సూపర్ ఇంజిన్ ఆయిల్ (ఒక్కొక్కటి 3 లీటర్లు) – ం3 డబ్బాలు, చిరాన్ యూరిన్ కలెక్టింగ్ బ్యాగ్ (2 లీటర్లు) – ఒకటి , లేడీస్ బ్యాగ్ – రెండు , వివిధ రకాల మందులను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి

# సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన జిల్లా కాంగ్రెస్ కోరం సురేందర్



**టేకులపల్లి,డిసెంబర్ 24, ప్రజాజ్యోతి:** మండలంలోని ఎర్రాయిగూడెం గ్రామ పంచాయతీ చింతలకట్ట గ్రామంలో 10 లక్షల వ్యయంతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం కొబ్బరికాయ కొట్టి ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ ప్రారంభించారు.అనంతరం చింతలకట్ట గ్రామంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే దారి ని గ్రామస్థులతో కలిసి సందర్శించారు.ఈ కార్య క్రమంలో సర్పంచ్ ఊకె రమేష్, పిఆర్ ఏఈ నవీన్ , మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, శివాజీ,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన ధరలను ముక్కోటి యాత్రికుల నుంచి వసూలు చేయాలి

- **భద్రాచలం ఎంవిఐ సంఘం వెంకటప్పయ్య**



**భద్రాచలం టౌన్,డిసెంబర్ 24(ప్రజాజ్యోతి )**భద్రాచలంకు ఈ నెల 28, 29, 30 తేదీల్లో ముక్కోటి యాత్రికుల నుంచి భద్రాచలం ఆటో యూనియన్ డ్రైవర్లు నిర్దేశించిన రేట్లను మాత్రమే వసూలు చేయాలని భద్రాచలం మోటారు వెహికిల్ ఇన్స్‌పెక్టర్ సంఘం వెంకటప్పయ్య పేర్కొన్నారు. భద్రాచలంలో బుధవారం ఎంవిఐ కార్యాయలంలో ఇందుకు సంబంధించిన ధరల పట్టిను ఆటో డ్రైవర్లకు ఎంవిఐ, అసిస్టెంటు ఎంవిఐ రాజశేఖర్ రెడ్డిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాచలం రామయ్య దర్శనంకు వచ్చే యాత్రికులతో ఆటో డ్రైవర్లు మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని కోరారు. నిర్దేశించిన ధరలను మాత్రమే వసూలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ అధ్యాపకులు కామేశ్వరరావు, ఈవో తిరుపతి పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో పశువులు




**చర్ల, డిసెంబర్ 24 (ప్రజా జ్యోతి ):**చర్ల మండలంలో ఆర్ కొత్తగూడెం గ్రామంలో అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకోవటంతో పశువులకు అడ్డాగా మారింది. ఈ సందర్భంగా ఆర్ కొత్తగూడెం గ్రామస్తుడు నూపా కృష్ణ మాట్లాడుతూ ఆర్ కొత్తగూడెం గ్రామంలో అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థలో చేరుకోవటంతో విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని ప్రతిరోజు రోడ్డు దాటి కిలోమీటర్ అవతలో ఉన్న పాఠశాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఉందని రోడ్డు దాటే క్రమంలో చిన్న పిల్లలకి ఏదైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నందున శిథిలావస్థకు చేరుకున్న అంగన్వాడీ కేంద్రాన్ని ప్రభుత్వ అధికారులు కూల్చివేసి నూతన భవనాన్ని నిర్మించి విద్యార్థులు చదువుకునేలాగా చూడాలని అన్నారు. ఈ క్రమంలో బుధవారం ఆర్ కొత్తగూడెం గ్రామానికి విచ్చేసిన భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావుకు అంగన్వాడీ కేంద్రం సమస్యను వారి దృష్టికి తీసుకు వెళ్లినట్లు నూతన అంగనవాడి భవనం నిర్మించే దిశగా చర్యలు తీసుకోవాలని విన్నవించినట్లు తెలిపారు .ఈ సందర్భగా ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు సానుకూలంగా స్పందించి త్వరలోనే నూతన భవనం ఏర్పాటు అయ్యేలాగా చర్యలు తీసుకుంటానని తెలియజేశారు అన్నారు.

# గిరిజన మ్యూజియంను సందర్శించిన 550 మంది విద్యార్థులు



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 24(ప్రజాజ్యోతి )** ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను భద్రాచలంలోని కోమల హై స్కూల్, పాల్వంచలోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల బాల బాలికలు 550 మంది మరియు 12 మంది ఉపాధ్యాయునీలు సందర్శించి మ్యూజియంలో పొందుపరిచిన గిరిజనుల అన్ని కళాఖండాలను క్లుప్తంగా తిలకించి చిన్నపిల్లలు సరదాగా మ్యూజియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రీడాస్థలంలో ఆటలు ఆడుకున్న అనంతరం ప్రిన్సిపాల్ లు మాట్లాడుతూ అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు నేటితరం బాల బాలికలకు తెలిసే విధంగా కళాఖండాలు ఏర్పాటు చేయడంతో పాటు వాటి యొక్క చరిత్రను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా తెలుగులో ముద్రించి ప్రదర్శించడం వలన విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగతమైందని, మ్యూజియంలో మాత్రం గిరిజనులకు సంబంధించిన స్పష్టమైన సమాచారం విద్యార్థులకు తెలిసే విధంగా మ్యూజియం నిర్వహకులు ప్రతి అంశం తెలియజేయడం చాలా బాగుందని అన్నారు. పాఠశాల, కళాశాలలకు మ్యూజియం సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా అవకాశం కల్పించి విద్యార్థిని, విద్యార్థులకు ఆటవీడుపుగా ఇటువంటి సందేశాలు ఉన్న గిరిజన కళాఖండాలు చూపెట్టడం వలన వారిలో మేధాశక్తి పెరిగి గిరిజన సంస్కృతి సాంప్రదాయాల గురించి పూర్తిస్థాయిలో తెలుసుకుంటారని అలాగే పాతతరం గిరిజనులు వాడే పనిముట్లు, ఆదివాసి గిరిజనుల సంస్కృతి భాష మరియు గిరిజనుల వేషధారణ కనుమరుగు కాకుండా కోయ భాషను పి ఓ రాహుల్ నేర్చుకొని భాష యొక్క అంతర్యాన్ని గిరిజనులు మరిచిపోకుండా అందరూ ఆచరించే విధంగా ఆయన చేస్తున్న కృషికి మా పాఠశాల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు. అలాగే మ్యూజియం ప్రాంగణంలో చిన్నారుల కోసం ఏర్పాటుచేసిన బోటింగ్ పాయింట్, సెల్ఫీ పాయింటు, పాతకాలపు ఇండ్లు చూడముచ్చటగా ఉన్నాయని, చిన్నపిల్లల కోసం ఏర్పాటుచేసిన క్రీడాస్థలం చాలా బాగుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు సంధ్యారాణి, ప్రసన్న, పావని, రమాదేవి, వీణ, ఉపాధ్యాయినీలు వరలక్ష్మి , రేవతి, మోహిని, ఊర్మిళ, స్వప్న ప్రియ, నాగమణి మ్యూజియం నిర్వహకులు వీరాస్వామి, మాధవి, చలపతిరావు మరియు విద్యార్థినీ విద్యార్థులు, బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు పండ్లు పంపిణీ

- **సియోన్ ప్రార్థన మందిరం పాస్టర్ కిరణ్**



**చర్ల, డిసెంబర్ 24 (ప్రజా జ్యోతి ):**చర్ల మండలంలో బుధవారం ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు జరుపుకునే క్రిస్టమస్ పండుగను పురస్కరించుకొని చర్ల మండలం లోని తేగడ గ్రామంలో గల సీయోను ప్రార్థన మందిరం పాస్టర్ కిరణ్ కుమార్ సత్యనారాయణపురం, చర్ల, కొయ్యూరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి వర్ధన్ ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జున రావు కట్టం కన్నారావు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సర్పంచ్



**టేకులపల్లి,డిసెంబర్24,ప్రజాజ్యోతి:** గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని తన పూర్తి మద్దతు సహకారం ఉంటుందని మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన టేకులపల్లి మండలం దాసు తండ గ్రామ సర్పంచ్ భూక్య చందర్ సింగ్ ఎంపిను మర్యాదపూర్వకంగా స్వగృహం నందు కలిసి,శాలువాతో సన్మానించి, పుష్ప గుచ్చంతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఎంపి హామీ ఇచ్చారు. కాం గ్రెస్ పాలనలో గ్రామ పంచాయతీలు దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. సర్పంచ్ భూక్య చందర్ సింగ్ ను అభినందించి, భవిష్యత్తులో ఇంకా ఎన్నో ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భూక్య ఈశ్వర్ నాయక్, టేకులపల్లి మండల నాయకులు లకావాత్ లాలు నాయక్ పాల్గొన్నారు.

## ఉద్యానవన పరిశోధన స్థానానికి మంచి పేరు తెచ్చారు

- అటెండర్ స్థాయి నుంచి రికార్డ్ అసిస్టెంట్, ఎక్స్టెన్షన్ అధికారిగా పదోన్నతలు పొందిన ఎం.డి హుస్సేన్
- ఉత్తమ అధికారిగా ఎంపికైన ఎం.డి హుస్సేన్ అభినందించిన సహోద్యోగులు



**అశ్వారావుపేట, డిసెంబర్ 24,ప్రజాజ్యోతి:** కొండా లక్ష్మణ్ తెలంగాణ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఉత్తమ అధికారిగా అశ్వారావుపేట ఉద్యాన పరిశోధన స్థానంలో ఏ ఈ ఓ గా విధులు నిర్వహిస్తున్న ఎండి హుస్సేన్ అవార్డు వరించింది. కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం 14వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉద్యోగంలో నిబద్దతగా ఉత్తమంగా విధులు నిర్వహించిన అధికారులకు అవార్డులు అందించారు. 1991లో అటెండర్ గా విధుల్లో జాయిన్ అయినా హుస్సేన్ అనంతర కాలంలో రికార్డు అసిస్టెంట్ గా ఆ తర్వాత అగ్రికల్చరల్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్గా పదోన్నతులు పొందారు 2007వ సంవత్సరం అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ గా పదోన్నతి పొందిన ఆయన గత 18 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఎండి హుస్సేన్ కు యూనివర్సిటీ బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు రావడంతో సహ ఉద్యోగులు, స్టాఫ్ అభినందించారు.

## జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ





**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 24, ప్రజా జ్యోతి**జనతా ఫౌండేషన్ నిర్వాకురాలు బేరా లక్ష్మి బుధవారం పాల్వంచ పట్టణ పరిధిలోని గుడిపాడు గ్రామంలో పలువురు వృద్ధులకు, వికలాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనతా ఫౌండేషన్ ద్వారా వచ్చిన నిధులతో నిరుపేదలకు వస్తు రూపంలో గానీ, వైద్య ఖర్చుల కోసం కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు, అదేవిధంగా తాను జనత ఫౌండేషన్ ద్వారా తనకున్నంతలో అనేక సేవా కార్యక్రమాలు ప్రభుత్వం పాఠశాల విద్యార్థినిలకు అంతరించిపోతున్న సంస్కృతి సంప్రదాయా కోలాటం నృత్యము,ఉచిత శిక్షణ ,విద్య, వైద్యానికి ఇబ్బందులు పడుతున్న కష్టకాలంలో తనకున్నంతలో స్పందిస్తూ సహాయ సహకారాలు అందిస్తూ సమాజంలో ప్రతి ఒక్కరికి సామాజిక బాధ్యతతో పేదవారిపట్ల మానవత వ్యక్తిత్వంతో సహాయపడాలని లక్ష్యంతో ముందడుగు వేస్తు సమాజ సేవ చేస్తున్నట్లు తెలిపారు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుడిపాడు గ్రామానికి చెందిన జిఎస్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ఆరమ్ ప్రశాంత్ పాల్గొని మాట్లాడారు, జనతా ఫౌండేషన్ అధ్యక్షురాలు బేర శ్రీ లక్ష్మీ నిరుపేదలకు, చేయూతనిస్తూ కోలాటం లో ప్రావీణ్యం పొంది అనేకమంది విద్యార్థులను కోలాటంలో ఉచితంగా శిక్షణ ఇస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న జనతా ఫౌండేషన్ నిర్వాకురాలు లక్ష్మీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనత ఫౌండేషన్ సభ్యులు నజియా , లావణ్య , మల్లేష్ , శెట్టిపల్లి సర్పంచ్ కొర్శ వీరబాబు ,, సోడే మధు, బంగారు జాలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే జారె









**దమ్మపేట, డిసెంబర్ 24 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం, కొమ్ముగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఘనంగా ప్రారంభించారు, ఈ సందర్భంగా జారే మాట్లాడుతూ,గ్రామాల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని,గ్రామ పంచాయతీ భవనాలు ప్రజల సమస్యల పరిష్కారానికి కేంద్ర బిందువులుగా ఉండాలని, ప్రజలు తమ సమస్యలను సులభంగా తెలియజేసే వేదికలుగా వీటిని వినియోగించుకోవాలని సూచించారు.అనంతరం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామంలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. కమ్యూనిటీ భవనాలు గ్రామస్థుల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడతాయని, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సౌకర్యాలు పెరగడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు.గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి గ్రామంలో అవసరమైన ప్రభుత్వ భవనాలు, మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో అశ్వారావుపేట నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ట్రెక్కింగ్ ద్వారా యువతలో ఆరోగ్యం, క్రమశిక్షణతో పాటు ప్రకృతి పట్ల బాధ్యత పెరుగుతుంది

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్









**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 24, ప్రజా జ్యోతి** ట్రెక్కింగ్ చేయడం ద్వారా యువతలో శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణతో పాటు ప్రకృతి పట్ల బాధ్యతాభావం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. జిల్లాలో "ఏరు ఫెస్టివల్" కార్యక్రమంలో భాగంగా బుధవారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస నగర్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం గుట్టపై ట్రెక్కింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ సౌరబ్ స్వయంగా పాల్గొని గుట్టపై కొంత దూరం వరకు ట్రెక్కింగ్ చేశారు. ట్రెక్కింగ్ సమయంలో పరిసర ప్రాంతాల్లోని అటవీ సంపద, సహజ ప్రకృతి అందాలను పరిశీలిస్తూ యువతతో కలిసి ఉత్సాహంగా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అనంతరం గుట్టపై ఉన్న హిల్ వ్యూ పాయింట్‌ను సందర్శించి అక్కడి నుంచి పాల్వంచ పట్టణాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని సహజ దృశ్యాలు, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతపై అధికారులు యువతతో చర్చించారు.అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనం చేసుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ పరిసరాల పరిశుభ్రత, భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆలయ బాధ్యులతో వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పాల్వంచ ప్రాంతంలో ఇలాంటి ప్రకృతి సౌందర్యంతో కూడిన పర్యాటక ప్రాంతాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండటం గర్వకారణమని తెలిపారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ప్రకృతికి దగ్గరగా ఉల్లాసంగా గడపడానికి ఇది అత్యంత అనుకూలమైన ప్రదేశమని అన్నారు. యువత, విద్యార్థులు ఇలాంటి ట్రెక్కింగ్ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వం పెరగడమే కాకుండా ప్రకృతి సంరక్షణపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రకృతి ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు "ఏరు ఫెస్టివల్" ద్వారా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పర్యాటక అభివృద్ధి చెందుతుందన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి యం. పరంధామ రెడ్డి, తహసీల్దార్లు దుర్గాప్రసాద్, భగవాన్ రెడ్డి, ఆలయ బాధ్యులు కొత్త వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, టి ఎన్ జి ఓ ప్రతినిధి చైతన్య భార్గవ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మహిధర్, కోచ్‌లు నాగేంద్ర, కల్యాణ్ (ఆర్చరీ), నబీ (రైఫిల్ షూటింగ్), రమేశ (టైక్వాండో), వివిధ క్రీడాకారులు, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల పాల్వంచ ప్రిన్సిపల్ అనురాధ, పిడి శ్వేత, విద్యార్థులు, ఎన్సిసి, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, ఆలయ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.